సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 25 అక్టోబర్ 2024
పేజీలు 8

## మాన్యువల్‌గానే ఇసుక తవ్వకాలు



**జేసీబీ, ప్రొక్లైన్ వంటి యంత్రాలను ఉపయోగించడానికి అనుమతులు లేవు**

**జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో ఇసుక తవ్వకాలు మాన్యువల్ పద్ధతిలోనే చేపట్టాలని, తవ్వకాలకు జేసీబీ, ప్రొక్లైన్ వంటి యంత్రాలను, ఉపయోగించడానికి ఎలాంటి అనుమతులు లేవని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వాహన రవాణాదారులకు స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపు మందిరంలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మిగతా 2లో...

# త్వరలో ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్

- సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు
- దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు
- మండలాల వారీగా అధికారులతో పాటు ప్రజలతో చర్చించి సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- దుందిరాలపాడులో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు భూమి పూజ
- ఎంపీ, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు





**గంపలగూడెం, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. దుందిరాలపాడులోని రహదారుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. మిగతా 2లో

## ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

**నందిగామ, కంచికచర్లలో రక్త దాన శిబిరం ఏర్పాటు**





**విజయవాడ క్రైం/నందిగామ, మేజర్ న్యూస్ :** పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలోని నందిగామ సబ్ డివిజన్, నందిగామ రూరల్ కంచిక చెర్ల గ్రామంలోని ఓ.సి.క్లబ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం కొత్త ప్రభుత్వ ఆసుపత్రి వారి ద్వారా రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులు, ఇతరులు మొత్తం సుమారు 500 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మాట్లాడుతూ ది.21.10.2024వ తేదీ నుండి ది.31.10.2024వ తేదీ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో గురువారం నందిగామ రూరల్ కంచిక చెర్ల గ్రామంలోని ఓ.సి.క్లబ్ ఫంక్షన్ హాల్‌లో రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజా క్షేత్రంలో నిత్యం ప్రజల సేవకే అంకితమైన పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. అందరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఒత్తిడిని అధిగమించడానికి యోగ, ధ్యానం చేయాలని సూచించారు. అమరవీరుల స్ఫూర్తితో రక్త దాన శిబిరానికి తరలి వచ్చి రక్తదానం చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రతేకంగా అభినందించారు. మిగతా 2లో...




## డ్రోన్ కెమెరాలతో... ట్రాఫిక్ నియంత్రణ

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి రాజశేఖర్ బాబు వినూత్నంగా ఆలోచించి ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించుకుని లైవ్ డ్రోన్ కెమెరాల (లైవ్ డ్రోన్ ఇంటిగ్రేటెడ్ టు కమాండ్ కంట్రోల్) ద్వారా ట్రాఫిక్ రద్దీని ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ నుంచి అధికారులు పరిశీలించి సిబ్బందికి మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## మాన్యువల్‌గానే ఇసుక తవ్వకాలు

ఇసుక తవ్వకాలపై రవాణాదారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని ఇసుక రీచ్ ల్లో జెసిబి, ప్రొక్లెన్ వంటి యంత్రాలను ఉపయోగించడానికి వీల్లేదని, కేవలం మనుషులతో మాన్యువల్ తవ్వకాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఉదాసీనత ఉండదని, నిబంధనలను ఉల్లంఘించిన వారి యంత్రాలను సీజ్ చేసి ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ఇదే విషయాన్ని ఇతర రవాణాదారులకు సమాచారం అందించాలని సూచించారు.

## త్వరలో ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్

తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం దుందిరాలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడికి దుందిరాలపాడు గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఎంపీగా కేశినేని శివనాథ్ గెలిచిన తర్వాత మొదటిసారిగా దుందిరాలపాడు రావటంతో ఆ గ్రామ టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్ల సమస్యలనీ పరిష్కరించాలని గ్రామప్రజలు కోరగా ఎంపీ కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ గ్రామలనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని వివరించారు. దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల సమస్యలను మండలాల వారీగా అధికారులతో పాటు ప్రజలతో చర్చించి సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు తాను ఎప్పుడు అందుబాటులో వుంటానని, ఏసీ రూమ్ లో కూర్చొనే వ్యక్తిని కాదని, ప్రజల మధ్య వుంటూ వారి సమస్యలు పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ దుందిరాలపాడులో రహదారుల సమస్యలనే కాకుండా తిరువూరు నియోజకవర్గంలో నెలకొన్న అనేక సమస్యలను ఎంపీ సహకారంతో పూర్తి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు, గంపలగూడెం మండల పార్టీ అధ్యక్షులు రేగళ్ల వీరారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, గంపలగూడెం తెలుగు యువత అధ్యక్షులు మానికొండ రామకృష్ణ, టిడిపి నాయకులు తన్నీరు అజయ్, బూరుగు నారాయణ లతో పాటుగా ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



అనంతరం మహిళా పోలీసులతో నగర పోలీస్ కమీషనర్ మాట్లాడి ప్రజలందరికీ సైబర్ సిటిజన్ యాప్ పై, సైబర్ నేరాలు ఎ విధంగా జరుగుతాయి అనే విషయాలపై, మహిళా సంబంధిత నేరాలపై అవగాహన కల్పించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రూరల్ డి.సి.పి. ఉమామహేశ్వర రాజు, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, నందిగామ ఏ సి పి డా. బి రవికిరణ్, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు, సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు, సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.



# డ్రోన్ కెమెరాలతో ట్రాఫిక్ నియంత్రణ







(మొదటిపేజీ తరువాయి)

సూచనలు ఇస్తూ ట్రాఫిక్ నియంత్రించడం జరుగుతుంది. దీనిపై నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ విజయవాడ ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా టెక్నాలజీని ఉపయోగించుకుని ట్రాఫిక్ ను నియంత్రించడానికి లైవ్ డ్రోన్ కెమెరాల ద్వారా సమయత్నం జరుగుతుంది. ముఖ్యంగా బిజీ సమయాలలో వారధి, రామవరప్పాడు, బెంజ్ సర్కిల్, మహానాడు జంక్షన్, ప్రకాశం బ్యారేజ్ ఈ ఐదు ఏరియాలలో డ్రోన్స్ ఎగరేసి అదే సమయంలో కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తూ ఎక్కడైనా ట్రాఫిక్ అంతరాయం ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేసి క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మున్ముందు క్రైమ్ కేసులలో కూడా ఈ విధంగా ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.



## ఉదయభాను పై చేసిన వ్యాఖ్యలను ఖండించిన జనసైనికులు



**నందిగామ, అక్టోబర్ 24, మేజర్ న్యూస్:** జగ్గయ్యపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జనసేన పార్టీ ఎన్టీఆర్ విజయవాడ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పైన వ్యక్తిగతంగా, ఆయన వ్యాపారాల పైన నోముల రఘు అనే వ్యక్తి కొందరు వ్యక్తుల ప్రోద్బలంతో చేస్తున్నటువంటి అసత్య ఆరోపణలకు జిల్లా వ్యాప్తంగా జనసైనికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం పూజారి రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ ఉదయభాను రాజకీయ ఉన్నతిని ఓర్చుకోలేని కొందరు వ్యక్తులు ఈ నోముల రఘు అనే వ్యక్తిని అడ్డం పెట్టుకుని ఆడే నాటకం ఇందులో కీలుబొమ్మగా నోముల రఘు అనే వ్యక్తి మారాడు. ఉదయభాను ని గత కొంతకాలంగా వివిధ మీడియా మాధ్యమాల ద్వారా వ్యక్తిగతంగా విమర్శించడమే కాకుండా ఎవరో దాడి చేయడానికి యత్నిస్తేనో లేక నువ్వే సానుభూతి కోసం చేపించుకుని అది ఉదయభాను గారే దాడి చేపించారని మీడియా ముఖంగా మాట్లాడడం మీ చౌకబారు విమర్శలకు అద్దం పడుతుంది.జగ్గయ్యపేట నియోజకవర్గానికి శాసన సభ్యులు గా సేవలు అందించడమే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, విభజిత ఆంధ్ర ప్రదేశ్ లో కూడా ప్రభుత్వ విప్‌గా ప్రజలకు సేవలు అందించిన ప్రజా నాయకుడు ఉదయభాను. ఆయన ప్రతి పక్ష పార్టీలలో కూడా ఆయనను అభిమానించే వ్యక్తులు ఉన్నారు. ఆయన జనసేన పార్టీలో చేరుతున్నారు అని వార్త వచ్చిన నాటి నుండి ఆయన రాజకీయ ఉన్నతిని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు ఈ విధంగా నోముల రఘు అనే వ్యక్తి భుజం పైనుండి రాజకీయం చేద్దాం అని పగటి కలలు కంటున్నారు. జనసేన పార్టీ ఫైటర్స్ కి మారు పేరు ఎటువంటి ఫైటర్స్ కి ఉదయభాను లీడర్ అన్నారు ఈ విధంగా ఆయనను అప్రతిష్ట పాలుజేయాలని చూస్తే జనసైనికుల ఆగ్రహం జ్వాల ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ విషయమై నోముల రఘు వ్యాఖ్యలను జనసేన పార్టీ నందిగామ నియోజకవర్గం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



**కంచికచర్ల అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** మండలం మోగులూరు గ్రామానికి చెందిన సుకాసి చందనకు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయ నిధి నుండి మంజూరైన రూ. 3లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్థానిక గ్రామ, మండల పార్టీ నేతలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేసారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. సీఎం చంద్రబాబు చికిత్స కో సం ఆసుపత్రులకు డబ్బు ఖర్చుచేసిన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూతనివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెల ల్లోనే అనేక సంక్షేమ పథకాలను తీసుకురావడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు.

## రీ సర్వే భూ సమస్యల పరిష్కారం



**గంపలగూడెం, అక్టోబర్ 24, మేజర్ న్యూస్:** దీర్ఘకాలంగా గ్రామీణ ప్రాంతాల్లో పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారం కోసం రీ సర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఆర్డీవో కే మాధురి అన్నారు. తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గంపలగూడెం లో గురువారం జరిగిన రీ సర్వే గ్రామసభలో ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన రీ సర్వేలో ఎక్కువ లోపాలు ఉన్నట్లు గుర్తించామని, వాటిని పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులను ఆన్లైన్ చేసి మూడు నెలల్లోగా సమస్యలు పరిష్కరించనున్నామని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఉన్న సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారులను ఆర్డీఓ ఆదేశించారు. ఆయా పనుల నిమిత్తం మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గంపలగూడెం తహసీల్దార్ వీ రాజకుమారి, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరావతి రైల్వే లైన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదంపై హర్షం

### ప్రధాని, సీఎం, డీసీఎం లకు నూతలపాటి కృతజ్ఞతలు



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 24, మేజర్ న్యూస్:** అమరావతి రైల్వే లైన్ కు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేయడం పట్ల బీజేపీ మైలవరం నియోజకవర్గ కన్వీనర్ నూతలపాటి బాలకోటేశ్వరరావు (బాల) హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు కొత్త రైల్వే లైన్ కు ఆమోదం లభించిందన్నారు. రూ.2,245 కోట్లతో 57 కిలోమీటర్ల మేర ఈ రైల్వే లైన్ నిర్మాణం, కృష్ణా నదిపై 3.2 కిలోమీటర్ల మేర రైల్వే వంతెన నిర్మాణం జరగబోతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# టాటా న్యూ లెండింగ్ మార్కెట్‌ప్లేస్ 1 లక్ష తక్షణ వ్యక్తిగత రుణాల మైలురాయిని దాటింది




**విజయవాడ, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** టాటా డిజిటల్ ఈరోజు టాటా న్యూలో తన లెండింగ్ పార్టనర్‌ల ద్వారా 1 లక్షకు పైగా వ్యక్తిగత రుణాలను పంపిణీ చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని ప్రకటించింది. ఇది ఐఎన్ఆర్ కంటే ఎక్కువ. 1,000 కోట్లు. భారతదేశం అంతటా కస్టమర్‌లకు అందుబాటులో ఉండే ఆర్థిక పరిష్కారాలను అందించడంలో ప్లాట్‌ఫారమ్ యొక్క పెరుగుతున్న ప్రజాదరణ, నిబద్ధతను ఈ విజయం నొక్కి చెబుతుంది. ఈ విజయాన్ని జరుపుకోవడానికి, టాటా న్యూ తన పండుగ 'లోన్ ఉత్సవ్'ను ప్రారంభించింది, ఇక్కడ విజయవంతమైన లోన్ దరఖాస్తుదారులు 1,000 న్యు కాయిన్స్ (1 న్యు కాయిన్ = 1 రూపాయి ఆదా) పొందవచ్చు, ప్రతిరోజూ గోల్డ్ కాయిన్‌ను గెలుచుకోవడానికి అర్హత పొందుతారు. టాటా న్యూ ఇప్పుడు తన లోన్ ఆఫర్లను వ్యక్తిగత రుణాలకు మించి విస్తరించింది. ప్లాట్‌ఫారమ్ ఇప్పుడు గోల్డ్ లోన్‌లను కూడా అందిస్తుంది, మ్యూచువల్ ఫండ్స్‌పై రుణాలు, గృహ రుణాలు త్వరలో అనుసరించబడతాయి. టాటా న్యూ యొక్క రుణ సమర్పణలు 10 నిమిషాల కంటే తక్కువ సమయంలో పూర్తి చేయగల పూర్తి డిజిటల్, పేపర్‌లెస్ అప్లికేషన్ ప్రాసెస్ సౌలభ్యంతో కస్టమర్‌లు వారి విభిన్న ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి అనుమతిస్తాయి. రుణదాతలు ఆమోదించిన తర్వాత, రుణ మొత్తం తక్షణమే కస్టమర్ యొక్క బ్యాంక్ ఖాతాకు బదిలీ చేయబడుతుంది, ఇది అత్యవసర ఆర్థిక అవసరాలకు ఆదర్శవంతమైన పరిష్కారం. టాటా న్యూ యొక్క రుణ విపణి ఐఎన్ఆర్ ని అధిగమించి ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. 1,000 కోట్ల మొత్తం రుణాలు పంపిణీ చేశారు.

ఈ విజయం మా ఆఫర్‌లపై మా కస్టమర్‌ల విశ్వాసానికి నిదర్శనం, అందుబాటులో ఉండే, అతుకులు లేని ఆర్థిక పరిష్కారాలను అందించడంలో మా తిరుగులేని నిబద్ధతకు నిదర్శనం" అని టాటా డిజిటల్‌లోని ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ గౌరవ్ హజ్రాతి అన్నారు. "మా ఆర్థిక సేవలను మరింత విస్తరించేందుకు మేము అంకితభావంతో ఉన్నాము. ఆఫర్‌లు, మా కస్టమర్‌ల అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా సమగ్ర రుణ పోర్ట్‌ఫోలియోను అందించడానికి రుణదాతలతో మా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం." సహకారంపై వ్యాఖ్యానిస్తూ, టాటా క్యాపిటల్ రిటైల్ ఫైనాన్స్, సీఓఓ, వివేక్ చోప్రా మాట్లాడుతూ, "టాటా న్యూతో, వ్యక్తులు వారి ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి సాధికారత కల్పించే రుణ పరిష్కారాలను అందించడానికి మేము గర్విస్తున్నాము. టాటా న్యూ యొక్క బలమైన ప్లాట్‌ఫారమ్‌తో మా సేవలను ఏకీకృతం చేయడం ద్వారా, మేము మరింత సమర్థవంతమైన, వినియోగదారు-స్నేహపూర్వక అనుభవాన్ని అందించగలుగుతున్నాము. ఈ భాగస్వామ్యం భారతదేశం అంతటా మిలియన్ల మంది కస్టమర్లకు క్రెడిట్ యాక్సెసిబిలిటీ, సౌలభ్యాన్ని పెంపొందించే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు వేసింది. మనీవ్యూ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సుష్మా అబ్బూరి జోడించారు, "టాటా డిజిటల్‌తో మా భాగస్వామ్యం గురించి మేము సంతోషిస్తున్నాము, ఇది దాని వినూత్న ప్లాట్‌ఫారమ్ ద్వారా వ్యక్తిగతీకరించిన రుణ ఉత్పత్తులను అందించడానికి మాకు వీలు కల్పిస్తుంది. కలిసి, మేము కస్టమర్‌లకు అతుకులు లేని అనుభవాన్ని అందిస్తాము, తద్వారా వారికి సులభతరం చేస్తాము. వారికి అవసరమైన ఆర్థిక పరిష్కారాలను యాక్సెస్ చేయండి. టాటా న్యూ లో టాటా డిజిటల్ యొక్క రుణ విపణి యొక్క బలం దాని విశ్వసనీయ రుణ భాగస్వాములైన టాటా క్యాపిటల్, ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్, మనీవ్యూ, క్రెడిట్‌బీ, ఫ్రిఫ్, రింగ్, క్యాష్, ఇండియాగోల్డ్, రూపేక్, ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్‌ల విస్తృత నెట్‌వర్క్‌లో ఉంది. ఓఎన్డీసీ యొక్క రుణ సమర్పణలను ముందుగా స్వీకరించిన వ్యక్తి. ఈ భాగస్వామ్యాలు వినియోగదారులకు విస్తృత శ్రేణి రుణ ఎంపికలను అందిస్తాయి - సురక్షితమైన, అసురక్షిత, పోటీ వడ్డీ రేట్లు, కనిష్ట ప్రాసెసింగ్ రుసుములను కలిగి ఉంటాయి. అదనంగా, టాటా డిజిటల్ తన వినియోగదారుల కోసం మొత్తం విలువ ప్రతిపాదనను మెరుగుపరచడానికి టాటా న్యూపై ఉచిత క్రెడిట్ స్కోర్ నివేదికలను అందిస్తుంది.

# పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా ధనేకుల





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఆదేశానుసారం ధనేకుల మురళీమోహన్ రావు ఆధ్వర్యంలో పెనమలూరు నియోజకవర్గం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కృష్ణాజిల్లా కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్నీడి బాబ్జి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లు కృష్ణ పాల్గొని పార్టీ నాయకులకు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇంచార్జ్ మార్నీడి బాబ్జి నియోజకవర్గ నాయకుల్ని కార్యకర్తలతో సంప్రదించి కాంగ్రెస్ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధనేకుల మురళీ మోహన్ రావు ఎన్నుకొన్నారు. దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర మరోలిందని పోరా కార్యకర్తలంతా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని షర్మిలని ముఖ్యమంత్రి చేసే ధ్యేయంతో పని చేయాలని సూచించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని దనేకుల మురళీమోహన్రావు తెలియజేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పోరాడుతూ పార్టీని బలోపేతం చేస్తామని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి పిసిసి ప్రధాన కార్యదర్శి మొవ్వ మోహన్ రావు, పెనమలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిసెల సుబ్రహ్మణ్యం, కిలారు వెంకటరత్నం మహమ్మద్ ముస్తాక్ తోటకూర రాధ మాధవి బాలాజీ నాయక్ రాజశేఖర్ వర్మ, ఆరికట్ల సురేష్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన బీజేపీ శ్రేణులు



**నందిగామ, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** కాంద్రపాడు గ్రామ జగనన్న ఇళ్ల పట్టాల లేఅవుట్‌కు సంబంధించి జరుగుతున్న వివాదం దృష్ట్యా బాధిత కుటుంబానికి చెందిన రెవిన్యూ ధ్రువపత్రాలను అందజేసి, కోర్టు పరిధిలో ఉన్న తదితర అంశాలను ఆర్డిఓ తో చర్చించి లబ్ధిదారులను, బాధిత కుటుంబాన్ని విచారించి ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఇరువురికి న్యాయం జరిగేలాగా చర్యలు తీసుకొని గ్రామంలో శాంతి భద్రతలను పరిరక్షించాల్సిందిగా నందిగామ బిజెపి శాఖ నుండి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి, లబ్ధిదారుడు కుంటిమద్ది వాసుకి మధ్య ఉత్పన్నమైన చిన్న చిన్న సమస్యలను గ్రామ వైసిపి నాయకులు, మండల నాయకులు తో కలిసి రాజకీయంగా లబ్ధి పొందాలని గత 20 రోజులుగా నందిగామ భారతీయ జనతా పార్టీ నాయకులు పై సాక్షి దినపత్రిక ద్వారా వచ్చిన వార్తలను ఖండిస్తూ ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని, గ్రామ ఉపసర్పంచ్ వైసిపి నాయకుడు కొండా కృష్ణారెడ్డి మొన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 2020 సంవత్సరంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారని ఆ భూమిలో బాధితుల కుటుంబం వచ్చి కబ్జాకి గురి చేశారని చెబుతూ, నిన్న ఈ వివాదంలోకి మాజీ మంత్రి దివంగత దేవినేని వెంకటరమణ హయాంలో ప్రభుత్వ భూమి కింద పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 1994 వ సంవత్సరంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే అదే భూమిని తిరిగి మళ్ళీ 2020 సంవత్సరంలో మళ్లీ ఇళ్ల పట్టాలకు ఎలా కేటాయిస్తారో స్థానిక వైసీపీ నేతలు తెలపాలని కోరారు. ఇది కేవలం నందిగామ ప్రాంతానికి చెందిన కూటమి నేతలను లక్ష్యంగా చేసుకొని అధికారం కోల్పోయామనే నిరాశలో మాట్లాడుతున్నారని, స్థానిక బిజెపి నేతలు ఎప్పుడు కూడా చట్టాన్ని చేతుల్లోకి అగౌరపరిచేలా తీసుకోలేదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర నాయకులు గౌటిక శివకృష్ణారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతా రామయ్య, కో- కన్వీనర్ శ్రీనివాసరావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొత్త సాంబశివరావు, చందర్లపాడు, నందిగామ మండల అధ్యక్షులు గుత్త బాలకృష్ణ గంటా వెంకట్రావు, చందర్లపాడు నందిగామ యువమోర్చా అధ్యక్షులు వెంకటప్పారెడ్డి, శివ నరసింహారావు తదితర ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కె.సి. జైన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు ఉదయభాను



**జగ్గయ్యపేట, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** పట్టణంలోని బలుసు పాడు రోడ్డులో గల స్పడ్స్ పాలి ఇండస్ట్రీస్ అధినేత కె. సి.జైన్ అనారోగ్యంతో హైదరాబాదులోని ఏ ఐ జి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను వారి స్వగృహానికి వెళ్ళి వారికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది.

## చల్లపల్లి మండలంలో ఇసుక రీచ్ లు లేవు

### ఎడ్లబండ్ల ద్వారా ఇసుక రవాణాకు సైతం అనుమతి లేదు



**చల్లపల్లి మేజర్ న్యూస్:** మండలంలో ఇసుక రీచ్ లు లేవనీ, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. చల్లపల్లి ఎస్ఐ పిఎస్వి. సుబ్రహ్మణ్యంతో కలిసి గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచీ మాత్రమే ఉచిత ఇసుకను తీసుకువెళ్లాలన్నారు. చల్లపల్లి మండలం సీఆర్ జడ్ పరిధిలో ఉండటంతో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవన్నారు. ఎడ్లబండ్లతో సైతం ఇసుక రవాణా చేసేందుకు వీలు లేదని స్పష్టంచేశారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఇసుక రీచ్ గుర్తించారనీ, త్వరలో అక్కడ ఏర్పాటుచేసే స్టాక్ పాయింట్ నుంచీ మాత్రమే ఇసుక తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సీఆర్ జెడ్ పరిధిలో ఇసుక తవ్వకాలకు పాల్పడితే కఠినతరంగా వ్యవహరిస్తామన్నారు. సమావేశంలో ఆర్ ఐ ఘంటసాల కృష్ణమోహన్ ఉన్నారు.

## గ్రాడ్యుయేట్స్‌కు హెల్ప్ లెగ్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**నందిగామ, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** కృష్ణా - గుంటూరు శాసనమండలి ఓటర్ల ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లడానికి గ్రాడ్యుయేట్స్ లో అవగాహన కల్పించుటకు ప్రత్యేకంగా నందిగామ గాంధీ సెంటర్ లో శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్క పౌరుడి భాధ్యత సమాజం బాగుండాలి అంటే సరైన నాయకులను ఎన్నుకోవలసిన అవసరం ప్రతి ఒక్క పౌరుడి మీద ఉందని. వచ్చేనెల 6 వ తారీఖు ఓటరు నమోదు కు చివరి రోజు కాబట్టి పట్ట భద్రులు అందరూ ఓటు నమోదు చేసుకోవలసిందిగా తమ ఓటు హక్కును చక్కగా వినియోగించుకోవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారంకు ఎంపికైన దేవరపల్లి



**చల్లపల్లి, అక్టోబరు 24, మేజర్ న్యూస్ :** చల్లపల్లికి చెందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు, సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. మాజీ ఉపప్రధాని వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో హోప్ స్వచ్ఛంధ సంస్థ, సింధు ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన జరిగే కార్యక్రమంలో సురేష్బాబు పురస్కారం అందుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ప్రముఖులతోపాటు సురేష్బాబు పురస్కారానికి ఎంపికయ్యారు.



## అధ్వాన్న స్థితిలో ఉన్న గండేపూడి, పొనుకుమాడు, విరివాడ రహదారి

**నందివాడ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గొంగళ్ళమూడి గ్రామం నుంచి పెద్ద విరివాడకు వెళ్ళు మార్గము పూర్తిగా ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆ మార్గమును గురువారం గండేపూడి, పొనుకు మాడు గ్రామస్తులు కలసి అధిక లోడుతో వెళ్లే లారీలను అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే నిత్యం ఆ మార్గము మీదగా 30 నుంచి 40 టన్నులతో అధిక బరువుతో లారీలు తిరగడంతో ద్విచక్ర వాహనదారులు ప్రయాణించు మార్గము పూర్తిగా ధ్వంసం అయినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ఆ దారి మీదుగా ద్విచక్ర వాహనదారులు ప్రయాణం నరకప్రాయంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని గండేపూడి, పొనుకుమాడు గ్రామ పరిధిలో ఉన్న చేపల చెరువు, ఆక్వా రైతులతో కలిసి మార్గమును ద్విచక్ర వాహనముల ప్రయాణమునకు అనుకూలంగా చేయవలసిందిగా గండేపూడి పొనుకుమాడు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిచో ఈ మార్గము మీదగా ఎటువంటి అధికలోడు లారీలు తిరగనివ్వబోమని చే చెరువుల, ఆక్వా రైతులను హెచ్చరించి మార్గమును స్తంభింపజేశారు. ఈ కార్యక్రమంలో గండేపూడి పొనుకుమాడు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన షేక్ ఖాసిం సాహెబ్‌ని అభినందించిన జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను



**జగ్గయ్యపేట, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** మండలంలో పోచంపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాసిం సాహెబ్ తమిళ నాడు రాష్ట్రంలోని అన్నామలై విశ్వవిద్యాలయం నుండి గురువారం జరిగిన 86వ స్నాతకోత్సవంలో గౌరవ తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా షేక్ ఖాసిం సాహెబ్ ని హైదరాబాద్ లోని ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను స్వగృహానికి ఆహ్వానించి డాక్టరేట్ పట్టా అందుకున్న సందర్భంగా ఆయన కి శుభాకాంక్షలు అందజేశారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. డాక్టరేట్ పొందిన షేక్ ఖాసిం సాహెబ్ ను మాజీ కౌన్సిలర్ చారుగుండ్ల కొండా కూడా ఆయనను అభినందించారు.

## నష్టపరిహారానికై తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



**కంచికచర్ల అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** వరద నష్ట పరిహారం అందించాలని కోరుతూ కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామానికి చెందిన బాధితులు గురువారం స్తానిక తహశీల్దార్ కార్యాలయం ముట్టడించారు. సెప్టెంబర్‌లో వచ్చిన కృష్ణానది వరదకు చెవిటికల్లు గ్రామం పూర్తిగా ముంపుకు గురైంది. ఆ సమయంలో నాలుగు రోజులు పాటు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులకు సాయం అందించేందుకు ఎవరూ రాలేకపోయారు. నాలుగు రోజులు పాటు గ్రామస్తులు ఎటువంటి సాయం అందక దుర్భిక్ష పరిస్థితులు అనుభవించామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వరద నష్టపరిహారం అందించడంలో ఉదాశీనంగా వ్యవహరించటం వల్ల పరిహారం అందే జాబితాలో మండలం గుర్తించబడలేదు. దీని పర్యవసానం ప్రభుత్వ సాయం బాధితులకు అందలేదు. విజయవాడ ఎంపి, స్తానిక ఎమ్మెల్యే వరద బాధితులకు పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చి నెల రోజులు గడచినా నేటికి బాధితులకు న్యాయం జరగలేదు. దీంతో బాధితులు అందోలన బాట పట్టారు. మా గ్రామానికి న్యాయం జరిపించండి అంటూ ప్రాధేయపడుతున్నారు.

# లేఔట్లకు అనుమతులు తప్పనిసరి





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ముడా పరిధిలో నిర్మించే భవనాలకు లేఔట్లకు తప్పనిసరిగా అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ముడా) టౌన్ ప్లానింగ్ కార్యకలాపాలపై జిల్లా కలెక్టర్ గురువారం కలెక్టరేట్లో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మచిలీపట్నం నగరపాలక సంస్థ పెడన మున్సిపాలిటీ తో పాటు, సి ఆర్ డి ఏ పరిధి మినహా మిగతా మండలాలు ముడా పరిధిలోకి వస్తాయని, ఈ పరిధిలో నిర్మించే భవనాలకు, లేఅవుట్లకు అనుమతుల మంజూరు ప్రక్రియ కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. భవన నిర్మాణాలకు ప్రాథమిక అనుమతులు ఇచ్చాక ఏవైనా లోపాలు ఉంటే స్టాప్ వర్క్ ఆర్డర్ ఎలా అమలు అవుతుందో కలెక్టర్ ఆరా తీశారు. అనుమతులు పొందిన భవనాలు వారు ఇచ్చిన ప్లాన్ ప్రకారమే నిర్మిస్తున్నారా లేదా సమగ్ర వెరిఫికేషన్ విధానం అమలు చేయాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మిస్తుంటే నిబంధనల మేరకు నోటీసులు జారీ చేయడం, అవసరమైన చర్యలు చేపట్టుటకు స్పష్టమైన విధానం అమలు చేయాలన్నారు. ల్యాండ్ కన్వర్షన్ లేకుండా లేఔట్లు వేయకూడదని, లేఔట్ నిబంధనల ప్రకారం 15% మార్టిగేజ్, 10% ఓపెన్ స్పేస్ ఉండాలని అన్నారు. నగరపాలక సంస్థలో, మున్సిపాలిటీలలో ప్రత్యేక టౌన్ ప్లానింగ్ విభాగం ఉంటుందని, కానీ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ప్రణాళిక కార్యదర్శులు ఉంటారని, వీరికి భవన నిర్మాణాలు, లేఔట్ల అనుమతులపై వర్క్ షాప్ నిర్వహించి అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్, ముడ విసి ఇంచార్జ్ గీతాంజలి శర్మకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు, డిపిఓ జె అరుణ, ముడా ప్లానింగ్ అధికారి డి. శాంతిలత, ముడలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవిశంకర్, ఐ. పద్మావతి, నగరపాలక సంస్థలో టీపిఓ కె శ్రీహరి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షులు గొల్లు కృష్ణ తీరు బాధాకరం

### నియోజవర్గ ఇన్చార్జ్ లకు తెలియకుండా సమావేశాల నిర్వహణ ఎలా..?

### పామర్రు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతలపాటి సుబ్బారావు



**పామర్రు అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లాలో కాంగ్రెస్ పార్టీని సమన్వయం చేసి అభివృద్ధి చేసే విధంగా నూతన అధ్యక్షులు గొల్లు కృష్ణ వ్యవహరించడం లేదని పామర్రు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతలపాటి సుబ్బారావు ఆరోపించారు. పామర్రు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు డి వై దాసు కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో చింతలపాటి సుబ్బారావు మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గాన్ని సృష్టించి తొలి ఎమ్మెల్యేగా పనిచేసిన డి.వై.దాసు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ప్రత్యర్థి పార్టీలకు ధీటుగా ప్రచారం నిర్వహించారన్నారు. పామర్రు సెంటర్లో షర్మిలా రెడ్డి బహిరంగ సభ నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు తీసుకొచ్చారన్నారు. అలాంటి నాయకుడిని విస్మరించి పామర్రు లో సమావేశం నిర్వహించాలనే తలంపు ఏమాత్రం సక్రమం కాదని ఆయన తెలియజేశారు. అలాగే నియోజకవర్గంలో సమన్వయ కమిటీ ఏర్పాటు సైతం ఇన్చార్జికి తెలియకుండా ఏర్పాటు చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఇదంతా డీసీసీ అధ్యక్షులుగా గొల్లు కృష్ణ ప్రమేయంతోనే జరుగుతుందనే ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ వైఖరిపై తాము తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నామని ఈ విషయాలన్నింటిని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డికి తెలియచేస్తామన్నారు. డి.వై.దాసు నాయకత్వంలో రేపు షర్మిలా రెడ్డిని కలుస్తున్నట్టు ఆయన తెలియజేశారు. నియోజకవర్గ ఇన్చార్జిలకు తెలియకుండా వారిని సంప్రదించకుండా సమావేశం నిర్వహించడం, అలాగే సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడం పార్టీ విధానం కాదని, అలాంటి వైఖరిని నూతన డీసీసీ అధ్యక్షులు గొల్లు కృష్ణ విడనాడాలని ఈ సందర్భంగా చింతలపాటి సుబ్బారావు కోరారు. కృష్ణాజిల్లాలో జరుగుతున్న ఈ తతంగాన్ని పీసీసీ దృష్టికి తీసుకెళ్తామని షర్మిలకి విషయాలన్నీ తెలియజెప్పి పార్టీని సక్రమమైన మార్గం లో నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. ఇప్పటికైనా డీసీసీ అధ్యక్షులు గొల్లు కృష్ణ తన వైఖరి మార్చుకుని నియోజకవర్గ ఇన్చార్జిలతో సంప్రదించి సమావేశాలు నిర్వహించడం, సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడం సమంజసంగా ఉంటుందనే అభిప్రాయాన్ని చింతలపాటి సుబ్బారావు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ కేశవరావు, మొవ్వ రాజేష్, ప్రసాద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్‌పై వాసిరెడ్డి పద్మ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదు



**జగ్గయ్యపేట, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** పట్టణంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వర రావు, ఎంపిపి మార్కపూడి గాంధీ, జడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసిరెడ్డి పద్మ వైయస్ జగన్ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు క్యాబినెట్ హోదా కలిగిన మహిళ కమీషనర్ పదవి అనుభవించి, ఇటీవలే కాలంలో కూడా జగ్గయ్యపేట ఇన్చార్జిగా కావాలి అని స్వయంగా జగన్ ని కలిసి అడిగినప్పుడు కూడా లేని బాధ ఇప్పుడు రాజీనామా చేయగానే జగన్ పై వ్యాఖ్యలు చేయటం చాలా బాధగా, ఆశ్చర్యంగా ఉందని, 2014లో రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం ఇచ్చి పార్టీపై అన్ని విధాలుగా స్పందించే విధంగా జగన్ ఆమెకు అవకాశం కల్పించారన్నారు.. అదేవిధంగా 2019లో ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ గా క్యాబినెట్ హోదా కల్పించిన జగన్ పై ఆమె చేస్తున్న వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వర్ణించినట్టుగా ఉన్నాయని ఆయన మండిపడ్డారు. పార్టీలు మారేవారు మారండి మీకు ఎలాగో అధికారం లేకపోతే ఉండలేరు, వెళ్లేవారు వెళ్లండి అంతేగాని గౌరవం ఇచ్చిన నాయకుడి పై వ్యాఖ్యలు చేయడం సరికాదని ఇప్పుడు బురద చల్లుతారా, ఇదేనా మీ విజ్ఞత, మహిళా సాధికారత కోసం జగనన్న ఎంత కృషి చేశారో మీకు తెలియదా, మీ స్వలాభం కోసం ఇలా మాట్లాడడం విజ్ఞత కాదు అని ఆయన అన్నారు.



## రెడ్డిగూడెం రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన గంధం పుల్లయ్య

**రెడ్డిగూడెం మేజర్ న్యూస్ :** మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా గంధం పుల్లయ్య బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరువూరు నుండి సాదరణ బదిలీల్లో భాగంగా ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు రెడ్డిగూడెం ఆర్ ఐ గా బదిలీపై రావడం జరిగిందని ఆయన తెలిపారు.

# పొలంబాట పట్టిన విద్యార్థులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వినూత్న రీతిలో విద్యాభ్యాసం చేయడం కోసం అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పొలం బట పట్టారు. పాఠ్య పుస్తకాలలో నేర్చుకున్న పాఠ్యాంశాలు ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకున్నప్పుడే విద్యార్థులలో ఆ పాఠ్యాంశాలకు సంబంధించిన విషయం శాశ్వతంగా గుర్తుండిపోతుందని భావించిన జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కృష్ణవేణి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం పంట పొలాలకు తీసుకువెళ్లారు. 8వ తరగతి జీవశాస్త్ర పాఠ్యపుస్తకంలోని పంట ఉత్పత్తులు యాజమాన్య పద్ధతులు అనే పాఠ్యాంశంలో ఉన్న వ్యవసాయ పద్ధతులను గురించి బోధిస్తున్న క్రమంలో విద్యార్థులకు మరింత వివరంగా ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్పించాలనే

## వినూత్న రీతిలో విద్యాబోధన

ఉద్దేశంతో ఎనిమిదో తరగతి విద్యార్థులను అశ్వరావు పాలెం లోని తలుపుల దినేష్ వ్యవసాయ క్షేత్రానికి తీసుకువెళ్లారు. రైతులతో కలిసిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా రైతులను వ్యవసాయ విధానాల గురించి తెలుసుకున్నారు. దుక్కి దున్నడం దగ్గర నుంచి పంట కోత వరకు చేసే వివిధ రకాల పనులను, ఉపయోగించే ఎరువులను, విత్తనాలను గురించి విద్యార్థులు రైతును అడిగి తెలుసుకున్నారు. కోసిన పంటను ఏ విధంగా నిల్వ చేస్తారు ఎలా అమ్ముతారు లాంటి విషయాలను రైతు చక్కగా వివరించి చెప్పా రు. ఈ పర్యటనలో విద్యార్థులతో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యా యులు భాను ప్రకాష్, తెలుగు ఉపాధ్యాయురాలు ఎస్ ప్రవీణ పాల్గొన్నారు.



పాఠ్య పుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలని విద్యార్థులకు నేరుగా చూపించి నేర్పించాలని ఉద్దేశంతో ఈ క్షేత్ర స్థాయి పర్యటనకు తీసుకురావడం జరిగింది. ఈ విధంగా విద్యార్థులకు బోధించినట్లయి తే ఆ అంశానికి సంబంధించిన అవగాహనతో ఆ పాఠం వారికి ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

**జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కె కృష్ణవేణి**



మా జీవశాస్త్ర పాఠ్య పుస్తకంలోని వ్యవసాయ పద్ధతులను గురించి ప్రత్యక్షంగా చూసి నేర్చుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ పాఠ్యాంశం నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. **8వ తరగతి విద్యార్థిని ఎం.లహరి**

# గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన శేషగిరిరావు



**కోడూరు, మేజర్ న్యూస్ :** కోడూరు గ్రామపంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శిగా బండే శేషగిరిరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు నిర్వహించిన యలవర్తి సుబ్రమణ్యం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి నాగాయలంక మండలంలో కార్యదర్శి గా పనిచేస్తున్న జరుగు పవన్ కోడూరు ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహించి, ప్రస్తుతం శేషగిరిరావు పులిగడ్డ నుంచి కోడూరుకు బదిలీపై వచ్చి ఇంచార్జ్ బాధ్యతలు తీసుకోవడంతో పవన్ సొంత స్థానానికి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, కూటమి మండల నాయకులు,కార్యకర్తలు శేషగిరిరావుకు అభినందనలు తెలియజేశారు.

### శేషగిరిరావుకి అభినందనలు తెలిపిన కంచర్లపల్లి నాంచారయ్య



కోడూరు గ్రామపంచాయతీ ఇం చార్జ్ కార్యదర్శిగా గురువారం బాధ్య తలు చేపట్టిన బండే శేషగిరిరావుని కలిసి విలేకరి కంచర్లపల్లి నాంచారయ్య అభినందనలు తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు.



## కుంతీదేవి పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** ప్రాచీన కాలం నుండి వస్తున్న హిందూ ఆచార వ్యవహారాలను నేటికీ పల్లెల్లో ఆచరించడం హర్షణీయమని పామరు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు నియోజకవర్గ పరిధిలోని పమిడిముక్కల మండలం మామిళ్ళపల్లి గ్రామం దళితవాడలో జరిగిన కుంతీదేవి పండుగ వేడుకలలో వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆచార వ్యవహారాలు మరుగుపడుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో ని ప్రజలు మాత్రం కుంతీదేవి, గొంతానమ్మ వంటి గ్రామదేవతల పండుగలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంగా ఇటువంటి వేడుకలు నిర్వహించుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ గ్రామాల అభివృద్ధిలో కూడా ఇదేవిధంగా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు గ్రామస్తులు ఎమ్మెల్యే కుమార్ రాజాకు ఘన స్వాగతం పలికి ఆయనను సత్కరించారు. ఈ వేడుకల్లో భాగంగా గ్రామస్తులు సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో ఆ గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేషనల్ లైఫ్ టాక్ మిషన్, త్రైమాసిక సర్వసభ్య సమావేశం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గురువారం జిల్లా పశువర్ధసంవర్ధక శాఖ అధికారి కృష్ణాజిల్లా వారి ఆధ్వర్యంలో నేషనల్ లైఫ్ టాక్ మిషన్, త్రైమాసిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిఎన్ సీహెచ్.నర్సింహులు మాట్లాడుతూ ఈ నెల 25న ప్రారంభమయ్యే పశుగణన కార్యక్రమంను అందరూ తప్పకుండా పాల్గొని, సంబంధిత డేటాను ఆన్లైన్ చేయించవలసిందిగా కోరడ మైనది. జిల్లాలో సహాయ సంచాలకులు, పశు వైద్య అధికారులు పర్యవేక్షించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు బందరు గుడ్లవల్లేరు, వి పి సి గుడివాడ గన్నవరం, ఏ డి ఐ ఎస్ డి పి విజయవాడ వారు పాల్గొన్నారు.

## ప్రమాదాల జోన్ అక్కడ మద్యం షాపులకు అనుమతి వద్దు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం రామానగరం హిందూ స్మశాన వాటిక ఆవరణం ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి వద్దు అంటూ స్థానిక మహిళలు కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకి వినతి పత్రం అందించారు. మద్యం షాపు ఏర్పాటు చేసే ప్రదేశం ఎక్కువగా యాక్సిడెంట్లు జరుగుతాయని అది యాక్సిడెంట్ జోన్ అని మద్యం షాపు ఏర్పాటుతో ఆ ప్రాంతం మరింత ప్రమాదకరంగా మారుతుందని వారు వినతిపత్రంలో తెలిపారు. అక్కడ మద్యం షాపు ఏర్పాటు చేస్తే చిన్నపిల్లలకు మహిళలకు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని మహిళలు విన్నవించారు. టి. శివలీల, టి చంద్రావతి, బి విజయ,నాగమల్లేశ్వరి తదితరులు జాయింట్ కలెక్టర్ ను కలిసిన వారిలో ఉన్నారు.



## ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోండి

### వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు ఆదేశాలు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో ట్రాఫిక్ పోలీస్ అధికారులతో ట్రాఫిక్ సంబంధించిన అంశాలపై సమావేశం నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రధాన జంక్షన్ల వద్ద, ట్రాఫిక్ నియంత్రణకు, ఇతర ట్రాఫిక్ సమస్యలను పోలీస్ అధికారులు కమిషనర్ కి వివరించగా, విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని, ట్రాఫిక్ నియంత్రణకు, ప్రజల శ్రేయస్సు కొరకు నగరపాలక సంస్థ పరిధిలో ఎటువంటి అంశాలు ఉన్న దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ అన్నారు. ట్రాఫిక్ పోలీస్ వారు వివరించిన సమస్యను నగర పాలక సంస్థ అధికారులు పరిశీలించి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఏడిసిపి ప్రసన్నకుమార్, పోలీసు ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, బాల మురళీకృష్ణ, రమేష్, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెంటింగ్ ఇంజనీర్స్ పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

## డల్లాస్‌లో ఎమ్మెల్యే యార్లగడ్డకు ఘన స్వాగతం



**గన్నవరం, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** రెండు వారాల పర్యటన నిమిత్తం అమెరికా వెళ్ళిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు అమెరికాలోని డల్లాస్‌లో ఘన స్వాగతం లభించింది. మంగళవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి అమెరికా బయలుదేరి వెళ్లిన ఆయన 17గంటల ప్రయాణం అనంతరం అమెరికాలోని డల్లాస్ ఫోర్త్ వర్త్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. 17 నెలల సుదీర్ఘ విరామం అనంతరం, ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి తొలిసారి అమెరికా చేరుకున్న ఆయనకు ఎన్నారై టిడిపి నాయకులు, కార్యకర్తలు, తానా ప్రతినిధులు, యార్లగడ్డ అభిమానులు, ఎన్ఆర్ఐ తెలుగుయువత(డల్లాస్) నాయకులు పూలమాలలతో, పుష్ప గుచ్చాలు అందించి వెంకట్రావుకు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికేందుకు వచ్చిన నాయకులు కార్యకర్తలను ప్రతి ఒక్కర్ని ఆప్యాయంగా పలకరిస్తూ ధన్యవాదాలు తెలిపిన అయన వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల్లో తన విజయం కోసం కృషి చేసిన టీడీపీ ఎన్ఆర్ఐ నాయకులు, కార్యకర్తల కు ఈ సందర్భంగా యార్లగడ్డ కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీల లెక్కింపు




**పామర్రు అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ పరిధిలోని పమిడిముక్కల మండలం మంటాడ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానములో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో 4,81,137 రూపాయలు నగదు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆర్. మాధవిలత తెలిపారు. దేవాదాయ శాఖ గన్నవరం ఇన్స్పెక్టర్ అనురాధ సమక్షంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, సేవా సమితి, ఆలయ సిబ్బంది కలసి హుండీలు లెక్కించినట్లు ఆమె చెప్పారు. గత 87 రోజుల కాల పరిమితికి సంబంధించి దేవాలయంలోని తొమ్మిది హుండీలను తెరచి నగదును లెక్కించినట్లు మాధవి లత తెలిపారు.



## ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రానికి విశేష స్పందన

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రానికి మూడవ రోజు సైతం విశేష స్పందన లభించినట్లు తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ తెలిపారు. స్థానిక ఏటీఎం సెంటరులో ఏర్పాటుచేసిన ఓటు నమోదు కేంద్రంలో పట్టభద్రులు ఓట్లను నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకూ 700 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. నవంబరు 6తేదీతో నమోదు గడువు ముగుస్తున్నందున పట్టభద్రులు త్వరితగతిన ఓట్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, షేక్ నబీఘోరీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తోట కనకదుర్గ, నేతలు మోర్ల ప్రసాద్, వాసిరెడ్డి రాకేష్, బావిశెట్టి కనకదుర్గ, లుక్కా శేషు, మేడికొండ రవిబాబు, పఠాన్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**పామర్రు అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ పరిధిలోని పమిడిముక్కల మండలంలో పలు గ్రామాల్లో ఈ నెల 25వ తేదీ గురువారం విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు స్థానిక ట్రాన్స్ కో ఎఈఈ తెలిపారు. మండల పరిధిలోని అగినపర్రు, మామిళ్ళపల్లి తదితర గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. కావున ఆయా గ్రామాల్లోని వినియోగదారులు విషయాన్ని గమనించి తమకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

## దిశా జిల్లా కమిటీ సభ్యురాలిగా మన్నే కళావతి నియామకం పట్ల ఎండీఏ కూటమి సభ్యుల హర్షం



**నందిగామ, అక్టోబర్ 24, మేజర్ న్యూస్:** మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మన్నే కళావతి దిశా జిల్లా కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు ప్రభుత్వ ఉత్తర్వుల నియామక పత్రాన్ని మండల పరిషత్ అధికారులు కళావతికి అందజేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి కళావతి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ ఎంపీటీసీ సభ్యురాలుగా, వైస్ ఎంపీపీగా, ఎంపీపీగా రాష్ట్ర టిడిపి మహిళా కార్యదర్శిగా పార్టీ అభ్యున్నతికి పనిచేసింది, దిశా జిల్లా కమిటీ సభ్యురాలుగా ఎంపిక పట్ల ఎంపీ కేసినేని శివనాథ్, జగ్గయ్యపేట నందిగామ ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్, తంగిరాల సౌమ్య, మాజీ మంత్రులు నెట్టెం రఘురాం, దేవినేని ఉమామహేశ్వరరావు లకు కళావతి కృతజ్ఞతలు తెలిపారు, కళావతి నియామకం పట్ల ఏటిపట్టు గ్రామాల టిడిపి జనసేన బిజెపి నాయకులు పలువురు హర్షం వెళిబుచ్చారు.

## ఐదు రోజులుగా మరణించినవారి ప్రతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న లంక లితిష్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఐదు రోజులుగా మైలవరం పట్టణంలో చనిపోయిన వ్యక్తి యొక్క ప్రతి కుటుంబాన్ని కులం, మతం, అని చూడకుండా, ఆ ఎవరో చనిపోయారు లే మనకెందుకులే అని చూస్తూ ఉండే ఈ రోజుల్లో, మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో ప్రతి కుటుంబాన్ని పరామర్శిస్తూ, తన వంతు సహాయం చేస్తున్న లంక లితిష్ మైలవరం రాజా పేటలోని గౌడ్ కులానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త అయినటువంటి మట్టా వెంకటేశ్వరరావు గురువారం ఉదయం మరణించాడు. సమాచారం తెలిసిన వెంటనే తెలుగు యువత, నాయకులు భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షుడు వారి కుటుంబానికి 5000/- రూపాయలు ఆర్థిక సహాయం చేసి, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ఎప్పుడు మర్చిపోదని, పార్టీ మీ కుటుంబానికి ఎప్పుడూ సహాయకంగా ఉంటుందని భరోసాని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లెల రాధాకృష్ణ,దూరు బాలకృష్ణ, బుడుపుటి వెంకట్రావు, ఒరుగు వెంకటేశ్వరరావు, జగదీష్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పని చేయాలి



**జి కొండూరు మేజర్ న్యూస్ :** గ్రాడ్యుయేట్ (పట్టభద్రుల) ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ మహాకూటమి గెలుపే లక్ష్యంగా పని చేయాలని, పట్టభద్రులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయ్యేలా చూడాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మైలవరం నియోజకవర్గంలో జరిగిన పట్టభద్రుల ఓటు నమోదు అవగాహన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు గురువారం పాల్గొన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు సహాయ కేంద్రంలో శాసనసభ్యులు కృష్ణప్రసాదు పాల్గొని ఓటు హక్కు దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూనవంబరు 6 వరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. నవంబర్ 23న ఓటర్ల జాబితా ముసాయిదా ప్రకటన...డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారన్నారు. డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహిస్తారని అన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు అర్హులైన గ్రాడ్యుయేట్స్ అందరూ మీ ఓటు నమోదు చేసుకోవాలని మైలవరం నియోజకవర్గ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఓటు నమోదు చేసుకునే పట్టభద్రులు 2021 నవంబరు 1 లోపు డిగ్రీ/ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికలకు తప్పనిసరిగా నూతనంగా ఓటు నమోదు కోవాలన్నారు. పాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు చెల్లదన్నారు. ఫారం 18 సమర్పించాలని సూచించారు. తగు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి తాజాగా ఓటు హక్కు పొందాలన్నారు. ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ లలో ఎలాగైనా ఓటుహక్కు పొందవచ్చున్నారు.ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా ఎన్డీఏ మహాకూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా) పోటీ చేస్తున్నారని, అందరూ ఆయన ఘన విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్డీఏ మహాకూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేత

**జగ్గయ్యపేట, అక్టోబర్ 24, మేజర్ న్యూస్ :** పట్టణంలో అనారోగ్యానికి గురై వివిధ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. తొర్రగుంటపాలెంనకు చెందిన అరివికట్ల శారద 23,400, ఆర్టీసీ కాలనీకి చెందిన కాటుబోయిన వెంకట నరసమ్మ 1,02,227,చెరువు బజారునకు చెందిన గుగ్గిళ్ళ వాసు 70,580,ముక్త్యాల రోడ్డు (మెయిన్ రోడ్డు) కి చెందిన సన్నె రామారావు 1,18,881, ఇసుకవాగు నకు చెందిన దొడ్డి చంద్రమ్మ 60,000, కొల్ల కాంప్లెక్స్ ఏరియా నకు చెందిన కొళ్ల సీతారత్నం 80,000, మంగలి బజారునకు చెందిన షేక్ షఫరూన్ 46,586, సత్యనారాయణపురం నకు చెందిన కాసర్ల సందీప్ 10,000,ఎర్ర కాలువ కట్టకు చెందిన బెరోతుల ఆది లక్ష్మి 40,000,గార్లపాటి.రాజ్యలక్ష్మి 23,400 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్వయంగా బాధితులు ఇళ్లకు వెళ్లి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ అనారోగ్యానికి గురై వివిధ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య సేవలు పొంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. పేదవారికి సీఎం సహాయ నిధి ఆపదలో అండగా నిలుస్తోందని అన్నారు.అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం సహాయ నిధి చెక్కులు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా శివాలయం ప్రథమ వార్షికోత్సవం



**జి కొండూరు మేజర్ న్యూస్ :** ఇబ్రహీం పట్నం, మూలపాడు గ్రామంలో వేంచేసియున్న బాల త్రిపుర సుందరీ దేవి సమేత విరూపక్షేశ్వర స్వామి వారి దేవాలయ (శివాలయం) ప్రథమ వార్షికోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసనసభ్యులు కృష్ణప్రసాదుకి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. శివాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మూలపాడు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శివాలయ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాన్ని కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో పూజలు, హోమాలు నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానికులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుని విజయవంతం చేయండి



**పామర్రు అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన విజయవంతం చేయాలని స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా విజ్ఞప్తి చేశారు. పామర్రు లోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుండి ప్రారంభ కానున్న సభ్యత్వ నమోదులో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గతంలో చేసిన సభ్యత్వాలకు స్ఫూర్తిగా తీసుకొని ఎన్నికలలో విజయం కోసం ఎంతో కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు అదే స్ఫూర్తితో సభ్యత నమోదులో కూడా భాగస్వామి వహించాలన్నారు. గతంలో సభ్యత్వం ఉన్నవారు తమ సభ్యత్వాన్ని పొడిగించుకోవడంతో పాటు కొత్తవారిని కూడా పార్టీ సభ్యులుగా చేర్చుకోవాలని సూచించారు. ఎక్కువ సభ్యత్వాలు చేర్చిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటల నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ఆన్లైన్ ద్వారా గాని, యాప్ ద్వారా గాని, వాట్సాప్ ద్వారా గాని సభ్యత్వ నమోదు చేసుకోవచ్చని, అలాగే పార్టీ కార్యాలయం నుండి వచ్చే ప్రతినిధుల సహకారంతో కూడా సభ్యత్వం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కేవలం 100 రూపాయల పార్టీ సభ్యత్వంతో అనుకోని ప్రమాదం సభ్యునికి జరిగినట్లయితే మట్టి ఖర్చుల కింద పదివేల రూపాయలు, భీమా కింద ఐదు లక్షల రూపాయలు వస్తాయని పేర్కొన్నారు. గ్రామ గ్రామాన ఈ సభ్యత్వ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరపాలని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కుమార్ రాజా కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వల్లూరిపల్లి గణేష్ కుమార్, వీరంకి వెంకటేశ్వరరావు, దాలిపర్తి ప్రసాద్, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సహాయ ఫౌండేషన్ పేదవాడి ఫౌండేషన్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సహాయ ఫౌండేషన్ ఆద్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వెనక సహాయ ఫౌండేషన్ సేవా క్యాంటీన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం, ఉచిత కంటి ఆపరేషన్ సహాయ ఫౌండేషన్ ఆద్వర్యంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వారు మెగా కంటి వైద్య శిబిరాన్ని ఈ నెల 26 శనివారం మల్కాపట్నం పాత రైల్వే స్టేషన్ రోడ్,ప్రభుత్వ ఆసుపత్రి వెనక భాగంలో గల సహాయ సేవా క్యాంటీన్ లో నిర్వహించనున్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారికి పూర్తిగా ఉచితంగా ఆపరేషన్ చేస్తారు. ఆసుపత్రి వారు వాహనాన్ని మన ఊర్లో పెట్టి వారే ఆపరేషన్ చేయించి తీసుకుని మరలా మన ఊర్లో దింపుతారు భోజనం కూడా వారే ఏర్పాటు చేస్తారు. ఆపరేషన్ చేయించిన తర్వాత రెస్ట్ తీసుకునే సమయంలో కొంత మొత్తని ఆర్థికంగా కూడా సహాయం చేస్తారు. కళ్లజోడులు కావలసిన వారికి కేవలం 300/- రూపాయలతో కళ్లజోడులు కూడా ఇవ్వడం జరుగుతుందికావున ఈ అవకాశాన్ని బందరు పరిసర ప్రాంత ప్రజలు.వినియోగించుకోవలసినదిగా కోరుతున్నాము – మీ సహాయ ఫౌండేషన్ వివరాలకు: 7013781789,86882 35377

# నివాస స్థలాల మధ్య మద్యం షాపు రద్దు చేయాలి



**ఘంటసాల, మేజర్ న్యూస్:** నివాస స్థలాల మధ్య మద్యం షాపు వద్దని పలువురు మహిళలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఘంటసాల నుంచి మల్లంపల్లి వెళ్లే రోడ్డులో పాత సంత బజారు రోడ్డు వద్ద మద్యం షాపు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా చుట్టుప్రక్కల ప్రజలు గళం విప్పారు. షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా మద్యం షాపు ఏర్పాటు చేయబోయే ప్రదేశంలో పెద్ద స్థాయిలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గకు, మొవ్వ ఎక్సైజ్ సీఐ వరాలరాజు లకు చుట్టు ప్రక్కల ప్రజలు ఊరి చివరకు షాపును మళ్లించాలని వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు, స్థానికులు మాట్లాడుతూ, ఘంటసాల గ్రామంలోని మల్లంపల్లి వెళ్లే మార్గమధ్యంలో పాత సంత బజారు రోడ్డు వద్ద మద్యం షాపును ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. మద్యం షాపు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి 100 మీటర్ల లోపు సీఎస్ఐ, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరాలు, రామాలయము, ప్రైవేటు ఆసుపత్రి, గొర్రెపాటి విద్యా ట్రస్ట్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం, రేషన్ షాపు, అంగన్వాడీ కేంద్రాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ ప్రదేశంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం వలన తాము తీవ్ర ఇబ్బందులు పడతామని పేర్కొన్నారు. జగనన్న కాలనీకి ఇదే మార్గంలో వెళ్లవలసి ఉంటుందన్నారు. గ్రామం చివర్లో మద్యం షాపులు ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీలో తీర్మానం చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బందిగా, నిత్యం రద్దీగా ఉండే సత్రం సెంటర్ నుండి అంబేద్కర్ నగర్ వరకు ఎక్కడా మద్యం షాపులు ఏర్పాటు చేయకుండా చూడాలని అధికారులకు విన్నవించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సంబంధిత విషయంలో చొరవ తీసుకుని, సమస్యను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని మహిళలు కోరుతున్నారు. నివాస గృహాల నడుమ, ప్రజలు ఇబ్బంది పడే ప్రదేశాలలో మద్యం షాపులు ఏర్పాటు చేయకూడదని ఎంత మొరపెట్టుకున్న, వినతి పత్రాలు సమర్పించినా ఎక్సైజ్ అధికారులు స్పందించడం లేదంటూ ఘంటసాల ప్రజలు చర్చించుకోవడం విశేషం.

## కార్తీక మాసంలో ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రానున్న కార్తీకమాసంలో ఏపీఎస్ఆర్టీసీ అవనిగడ్డ డిపో నుండి భక్తుల సౌకర్యార్థం ప్రముఖ శైవ క్షేత్రాలకు, పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడపబడుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ అవనిగడ్డ డిపో మేనేజర్ కె హనుమంతరావు గురువారం ప్రకటన లో తెలిపారు. ప్రతి శని, ఆది వారములలో పంచారామాల (అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట) లను ఒకేరోజు దర్శించుకునే విధంగా స్పెషల్ బస్సులు ఏర్పాటు చేస్తున్నామని,అలాగే ప్రయాణికులు, భక్తులు సమూహం(బ్యాచ్)గా వెళ్ళుటకు కోరిన యెడల వారికి అనుకూలమైన తేదీలలో, అనుకూలమైన దేవాలయాలకు సందర్శించే విధంగా స్పెషల్ టూర్ ప్రోగ్రామ్స్ కూడా ఏర్పాటు చేయ బడుతుందన్నారు. అవనిగడ్డ డిపో నుండి కార్తీక మాసం మొత్తం ప్రతిరోజు ఉదయం 6 గంటలకు అవనిగడ్డ నుండి శ్రీశైలం వరకు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సు నడపబడును ఇంకా శబరిమలైకు డిపో ఇటీవల వచ్చిన కొత్త బస్సుల్లో ఏర్పాటు చేయబడును ప్రయాణికులు భక్తులు రాబోవు కార్తీకమాసంలో ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకొనవలసిందిగా కోరారు. వివరాలకు 9959225466, 7382899427 ఫోన్‌లను సంప్రదించాలని హనుమంతరావు తెలిపారు.

## 15రూపాయిలు భోజనం పేదలకు ఆకలి తీరుస్తుంది



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఎస్ఆర్‌బి చక్రవర్తి పుట్టిన రోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు పేదలకు బోజనాలు అందించారు. సహాయ ఫౌండేషన్ చేపట్టిన 15రూపాయిలు భోజనం కార్యక్రమం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పేద ప్రజల దీవెనలు,బందరు ప్రజల ఆశీస్సులతో దిగ్విజయంగా కొనసాగుతుంది.దాతలు తమవంతు సహాయాన్ని అందించగలరని ప్రార్థిస్తున్నాము. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ బాషా, మహిళ విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మ, కార్యదర్శి సుధాబత్తుల లక్ష్మి, అంకాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఖతార్ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు బుద్ధప్రసాద్‌కు ఆహ్వానం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఈ ఏడాది నవంబర్ 22,23 తేదీల్లో ఖతార్ దేశంలో జరిగే తొమ్మిదవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు అవనిగడ్డ ఎమ్మెల్యే, నవ్యాంధ్ర తొలి ఉపసభాపతి, తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమ రథసారథి మండలి బుద్ధప్రసాద్ కు ఆహ్వానం లభించింది. ఈ మేరకు వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షులు వంగూరి చిట్టెన్ రాజు ఆహ్వానం పలికారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళా వేదిక దోహా, ఖతార్ సంయుక్త ఆధ్వర్యంలో ఖతార్ దేశ రాజధాని దోహా మహానగరంలో డీపీఎస్ మోనార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆటోరియంలో ఈ తొమ్మిదవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు ఏర్పాటు చేశారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ సాహిత్య సదస్సుకు అతిథిగా విచ్చేసి తెలుగు భాషా సాహిత్యాల ఆవశ్యకత మీద అమూల్యమైన సందేశాన్ని వినిపించమని కోరుతూ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షులు వంగూరి చిట్టెన్ రాజు ఆహ్వానం పలికారు. మధ్య ప్రాచ్య దేశాల ప్రధాన తెలుగు సంఘాలు అన్ని పెద్ద ఎత్తున ఈ సదస్సులో సహకార సంస్థలుగా పాల్గొంటున్నాయి.

## ఘనంగా మండలి వెంకట్రామ్ పెళ్లిరోజు వేడుకలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ యువ నాయకుడు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ – సాయి సుప్రియ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ నివాసంలో వెంకట్రామ్ – సాయి సుప్రియ దంపతుల పెళ్లిరోజు వేడుకల ను పురస్కరించుకుని కూటమి నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్ ను వెంకట్రామ్ దంపతులు కట్ చేసారు. భారీ గా కూటమి నాయకులు తరలివచ్చి వారికి శుభాకాంక్షలు, శుభాశీస్సులు తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు మత్తి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బచ్చు కృష్ణకుమారి, కూటమి నాయకులు బండే రాఘవ, కర్రా సుధాకర్, లుక్కా శ్రీనివాసరావు, బచ్చు రఘునాథ ప్రసాద్, ముళ్లపూడి శ్రీనివాసరావు, దాసినేని శ్రీనివాసరావు, మొగల్ మురాద్ బేగ్, గుడివాక నరహరి, తండు గంగాధర్, మైలా హరిబాబు, కొండవీటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ అవనిగడ్డ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు సమక్షంలో వెంకట్రామ్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కడవకొల్లు రమేష్, కమ్మిలి సాయి భార్గవ, రాజా, సాయి, మణి, వెంకటేశ్వరరావు, వీరబాబు, మురళి, వినోద్, పవన్ పాల్గొని ఆయనకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## చీరలు ఘటం బిందెల ఆదాయం రూ.4 వేలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భక్తులు కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి గా విరాజిల్లుతున్న అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మ వారికి భక్తులు మొక్కుబడిగా సమర్పించిన చీరలు, ఘటం బిందెలు వేలం ద్వారా 40 వేల 275 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వాహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు ఘటం బిందెలు వేలంపాట నిర్వహించగా భక్తులు పాడు కున్నారు. చీరలకు 30 వేల 425 రూపాయలు ఘటం బిందెలకు రూ7,850 లు, ధాన్యానికి రెండు వేల రూపాయలు మొత్తం కలిపి 40 వేల రెండు వందల 75 రూపాయలు ఆదాయం వచ్చింది అన్నారు. దేవాదాయ శాఖ మచిలీపట్నం డివిజనల్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ బహిరంగ వేలం పాటలో ఆసాదులు ఆలయ సిబ్బంది దామెర్ల ఏడుకొండలు, సామ్రాజ్యం, పి కృష్ణమూర్తి, కూనపు రెడ్డి నాని పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద 2024 వక్ఫ్ సవరణ బిల్లును, కేంద్రం ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏపీ శాసన సభలో తీర్మానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం లౌకిక సూత్రాలు రాష్ట్రా హక్కులు ఉల్లంఘించేలా ముస్లిం సమాజానికి ఇబ్బంది కలిగేలా ఉన్న ఈ బిల్లును ఆపాలని కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలనీ వేక్ఫ్ అధికారాలు పరిమితం చేసే విధంగా కేంద్రం సవరణలు చేయటం మత స్వేచ్ఛను దెబ్బతీయటమే అసలు ఈ అధికారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఎవరు ఇచ్చారని పత్రికా ముఖంగా ప్రశ్నిస్తున్నాము. ఏపీతో పాటు ఎన్ని రాష్ట్రాల్లో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంత మయ్యాయో వాటిని కాపాడి ఆక్రమణ దారులపై అందుకు సహకరించిన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లిం అసోసియేషన్ తరపున డిమాండ్ చేస్తున్నాము అన్నారు.

## పదవ తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని గోగినేనిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు, పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు గోపాలం జయ, వారి యొక్క సొంత ఖర్చులతో రూ.4 వేలు ఖర్చు చేసి పదవ తరగతి చదువుతున్న 26 మంది విద్యార్థులకు సోషల్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను కొని తీసుకుని వచ్చి, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ స్టడీ మెటీరియల్ పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణు మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ పుస్తకాలు, పదవ తరగతి సోషల్ సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించడానికి, నూటికి నూరు మార్కులు తెచ్చుకోవడానికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఉపాధ్యాయురాలు గోపాలం జయని ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాల్ అభినందించారు. ఈ సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు అందరూ అన్ని సబ్జెక్టుల్లో నూటికి నూరు శాతం మార్కులు సాధించేందుకు గట్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు, పాఠశాల ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మేడూరులో భారీ దొంగతనం





**పామర్రు అక్టోబర్ 24 మేజర్ న్యూస్ :** ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగలగొట్టి చోరీ చేసిన సంఘటన పమిడిముక్కల పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడూరు గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యలమంచి సాయి కృష్ణ 3 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామాంతరం వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇంటిదగ్గర పనిచేస్తున్న వ్యక్తి గురువారం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి యజమానికి సమాచారం అందించాడు. వారు హుటాహుటిన ఇంటికి వచ్చి పరిశీలించగా పెద్ద ఎత్తున వెండి, బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై పమిడిముక్కల పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. సిఐ చిట్టిబాబు నేతృత్వంలో ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వేలిముద్రలను, ఆధారాలను సేకరించేందుకు ప్రయత్నించగా ఎటువంటి వేలిముద్రలు, ఆధారాలు లభించకపోవడం గమనార్హం. దొంగలు చేతులకు తొడుగులు వాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై పమిడిముక్కల ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటనలో 10 కిలోల వెండి, 7నవర్సల బంగారం పోయినట్లు బాధితులు తెలిపారు.

# ఆరోగ్యకరమైన ఆహారం, శక్తివంతమైన జీవితానికి మూలస్తంభం





**ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి**

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీచైతన్య కృష్ణలంక శాఖలో హెల్తీ ఇండియా స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్ లో భాగంగా ఫుడ్ ప్లానెట్ ఎక్స్ పోని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం, శక్తివంతమైన జీవితానికి మూలస్తంభం. జంక్ ఫుడ్ తినడం మాని, సహజ ఆహారం మాత్రమే తినడం వలన మానసిక స్థితి మెరుగుపరచుకోవచ్చు, సేంద్రీయ ఆహారం గోల్డ్ లైఫ్ మనం తినే ఆహారం వలన, పోషక విలువలు, దీర్ఘాయువు, రోగనిరోధక శక్తి, మెరుగైన నిద్ర మొదలైన ప్రయోజనాలున్నాయన్నారు. అసహజమైన ఆహారపు అలవాట్ల వలన తాజా వ్యాధిగ్రస్త జీవితం అసంతృప్తి జీవనం ఏర్పడతాయన్నారు. పిల్లల యొక్క మానసిక శారీరక ఎదుగుదల హైస్కూల్ స్థాయిలో ఉంటుంది. కావున ఆహారం పట్ల శ్రద్ధ వహిస్తే వయసుకు తగ్గట్టు ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా విచ్చేసిన న్యూట్రిషనిస్ట్ మధు గాయత్రి మాట్లాడుతూ జంక్ ఫుడ్ తినవద్దని, హెల్తీఫుడ్ తినమని, త్వరగా నిద్రపోవాలి, త్వరగా నిద్రలేచి వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని సురక్షితంగా కాపాడుకోమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈజియంయం.మురళి కృష్ణ, ఆర్.ఐ.జె రాజేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ సురేష్, డీన్ కె.రాము, ఇన్చార్జులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని, విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు.

# పెథరోల్ టీహెచ్‌తో ఆరోగ్యవంతమైన రొయ్యలు




**విజయవాడ మేజర్ న్యూస్ :** రొయ్యలకు సోకే ఎంటరోసైటోజెన్ హెపటోపీనాయి (ఈహెచ్ పీ) వ్యాధి నుంచి కెమిన్ సంస్థ తయారు చేసిన పెథొరాల్ టీహెచ్ రక్షణ కల్పిస్తుందని కెమిన్ గ్లోబల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డాక్టర్ ఎం.రాజ్యలక్ష్మి, కమర్షియల్ డైరెక్టర్ డాక్టర్ సి.సుగుమార్ తెలిపారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణా, ఉభయ గోదావరి, నెల్లూరు జిల్లాల్లోని రొయ్యల చెరువుల్లో చేసిన విస్తృతమైన పరిశోధనలు, వాటి ఫలితాలు, రైతుల అనుభవాలను కెమిన్ రీజినల్ టెక్నికల్ మేనేజర్ డాక్టర్ వివేకానంద వివరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని రొయ్యల పరిశ్రమలో ఏపీ 73శాతం వాటా కలిగి ఉందని చెప్పారు. ఆక్వా రంగంలో ఈహెచ్ పీ వ్యాధిని తమ ఉత్పత్తి పథరోల్ సమర్థంగా ఎదుర్కొని అధిక దిగుబడులను ఇస్తుందని చెప్పారు. ఆరోగ్యవంతమైన రొయ్యలను అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో గ్లోబల్ రీసెర్చ్ అండ్ డవలెప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఏం. రాజ్యలక్ష్మి, మార్కిటింగ్ డైరెక్టర్ గ్రిన్, రీజినల్ డైరెక్టర్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు అధికారులతో సీపీ కో-ఆర్డినేషన్ మీటింగ్



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో కమీషనరేట్ పరిదిలోని అన్ని బ్యాంకుల అధికారులతో పోలీస్ కమీషనర్ గురువారం కో-ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిదిలో సైబర్ నేరాలపై ప్రజలలో భారీ ఎత్తున అవగాహన కల్పించి ప్రజలలో చైత న్యం తీసుకు వచ్చేందుకు వినూత్న పద్దతిలో ముందుకు పోవడానికి సైబర్ కమాండోలను, సోల్జర్స్‌లను ఏర్పాటు చేసి వారి ద్వారా వారి ఏరియాలోని ప్రజలకు సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతాయి, సైబర్ నేరానికి గురికా కుండా ఉండాలంటే ఏ ఏ జాగత్రలు తీసుకోవాలి? నేరం జరిగిన పక్షంలో ఏ విధంగా 1930 కు ఫిర్యాదు చెయ్యా లి? ఫిర్యాదు సమయంలో దర్యాప్తు అధికారులకి సమర్పించాల్సిన ఆధారాలు ఏమిటి వాటిని ఎలా సేకరించాలి? మొదలగు విషయాలపై ప్రజలను చైతన్య పరిచి వారిని సైబర్ సిటిజన్స్‌గా మార్చడం జరుగుతుందని, అదేవిధంగా ఈ మధ్య కాలంలో అత్యధికంగా సైబర్ నేరగాళ్లు "డిజిటల్ అరెస్ట్" పేరుతో అధికారులుగా నటిస్తూ నకిలీ ఎస్ఎంఎస్‌లు, వీడియో కాలు ద్వారా కస్టమర్లను భయభ్రాం తులకు గురి చేసి వారు మాదకద్రవ్యాలు, మనీలాండరింగ్ కేసుల్లో వారి ప్రేమేయం ఉన్నట్లు నమ్మించి అమాయకులను మోసం చేస్తున్నారు. ఆపరాద రుసుము చెల్లించమని బెదిరించి డబ్బులు ట్రాన్స్ఫర్ చేయిస్తున్నారని, దీనిలో బాగంగా బ్యాంకర్స్ యొక్క సహకారం అవసరం అని, సైబర్ నేరాల నివారణలో బాగంగా త్వరితగతిన విచారణ చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో ఏమైనా సలహాలు ఉంటే తెలియజేయమని, ఈ కార్యక్రమంలో బ్యాంకర్లు అందరూ బాగస్వాములు కావాలని, ఎటువంటి చర్యలు తీసుకుంటే ఇటువంటి నేరాలు జరుగకుండా నిరోధించగలం అనే విషయంపై నగరంలోని అన్ని బ్యాంకు అధికారులతో కులంకుషంగా చర్చించడం జరిగింది. అదేవిధంగా ఎవరైనా భాదితులు మీ వద్దకు వచ్చి తన ఎకౌంటు లో తనకు తెలియకుండా డబ్బులు పోయినాయని బ్యాంకుకు వచ్చి చెప్పినప్పుడు వారి డబ్బులు ఏ ఎకౌంటు కు వెళ్ళినాయో వారికి తెలియజేయాలని, మెయిల్ ద్వారా ఏదైనా ఎకౌంటు ఫ్రీజ్ చేసినప్పుడు ఆ డబ్బును వెంటనే రిలీజ్ చేసిన భాదితుడు, దర్యాప్తు అధికారులు చాలా ఆనందంగా ఉంటారని, చాలా మంది లక్షలలో మోసపోతున్నారని, వారిపట్ల మానవతాదృక్పథంతో వ్యవహరిం చాలని, వారికి తగిన సలహాలను అందించి పోలీస్ వారికి దర్యాప్తులో సహకరించాలని కోరినారు.

**ఎవరైనా కస్టమర్స్ కంగారుగా వచ్చి అధిక మొత్తంలో ట్రాన్స్ఫర్ చేయు సమయంలో వారిని బ్యాంకు మేనేజర్లు అడగాల్సిన ముఖ్య ప్రశ్నలు:**

- ఈ లావాదేవీ వ్యక్తిని మీరు వ్యక్తిగతంగా తెలుసా?
- డిజిటల్ అరెస్ట్ పేరుతో డబ్బు బదిలీ చేయమని ఒత్తిడి చేశారా?
- సీబీఐ, కస్టమ్స్, పోలీస్ పేరుతో వీడియో కాల్ వచ్చిందా? అని వారిని అడగాలని సూచించారు.
- ఈ క్రమంలో బ్యాంకు అధికారులకు కొన్ని ముఖ్య సూచనలు చేశారు.
- అనుమానాస్పద లావాదేవీలను నిలిపి వెంటనే సమాచారం ఇవ్వండి.
- బెదిరింపులకు గురైన కస్టమర్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయించండి.
- 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ కు కాల్ చేయమని సూచించండి.
- కస్టమర్‌ను సమీప పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయమని కోరండి.

**ప్రజలకు అవగాహన సూచనలు**

- ప్రభుత్వసంస్థలు వీడియో కాల్స్ లేదా మెసేజ్‌లు ద్వారా అరెస్టులు చేయవు.
- ఓటీపీలు లేదా బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు.
- తెలియని లావాదేవీలు చేయకుండా జాగ్రత్తగా ఉండండి.
- బ్యాంకులు, ప్రజల సహకారం ద్వారా డిజిటల్ అరెస్ట్ మోసాలను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో క్రైమ్ డి.సి.పి. తిరుమలేశ్వర రెడ్డి, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది, నగరంలోని అన్ని బ్యాంకుల నుండి సుమారు 120 అధికారులు పాల్గొన్నారు.

## బాణసంచా దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** దీపావళి సందర్భంగా నగరంలో బాణ సంచల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు లైసెన్స్ కలిగిన వ్యాపారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 29వ తేదీ నుండి 31వ తేదీ వరకు మూడు రోజులు దీపావళి పండుగ సందర్భంగా లేబర్ కాలరీలో స్టేడియం కొరకు కేటాయించిన స్థలంలో, మాకినేని బసవ పున్నయ్య మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, సింగ్ నగర్‌లో గల స్థలాలలో బానసంచ విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేసుకొనుటకు విక్రయదారులు దరఖాస్తు చేసుకోగలరని అన్నారు. బాణసంచా విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేసుకొనుటకు ఈనెల 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆఫీస్ పని చేయు దినాలలో దరఖాస్తులు పొంది, దాఖలు చేసుకోగలరన్నారు. అక్టోబర్ 28, 2024న మధ్యాహ్నం 3 గంటలకు దరఖాస్తుల సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా స్టాల్స్ కేటాయించబడినని తెలిపారు. దరఖాస్తు, ఇతర వివరాలకు నగరపాలక సంస్థ సర్కిల్ 2 కార్యాలయం సత్యనారాయణపురం ఏ కే టి పి ఎంసిహెచ్ స్కూల్ పక్కనగల ఎస్టేట్ విభాగం కార్యాలయం వద్ద సంప్రదించాలని కమిషనర్ అన్నారు.

## నూతన ఏపీ పీఎస్సీ చైర్మన్ అనురాధని కలిసిన సీపీ



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** రిటైర్డ్ ఐ.పి.ఎస్ అనురాధని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ పీఎస్సీ చైర్మన్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో అనురాధ గురువారం సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్ఓడీ బిల్డింగ్‌లోని వారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమీషనర్ ఎస్. వి. రాజ శేఖర బాబు ఏపీ పీఎస్సీ చైర్మన్ అనురాధని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి, అభినందనలు తెలిపారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**మొవ్వ మేజర్ న్యూస్ :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజిలెన్స్ వారోత్సవాలు పురస్కరించుకుని మండల పరిధిలోని కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెదపూడి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెదపూడి శాఖ మేనేజర్ సిహెచ్ పరమేష్ విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవి సత్య ప్రసాద్, లైబ్రరీ వై.వి కుమార్ ఫణి కుమార్, పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999